RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ
సంపుటి: 4 సంచిక:93 | మార్చి 26, 2026 | వెల: రూ.3-00 | సీఎండీ & ఎడిటర్
9701923260



## అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత

- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు ఎస్ఎఫ్ఐ ఆందోళన
- కంట్రోల్ రూమ్ సిగ్నల్ వద్ద విద్యార్థి నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కొద్ది సేపు ట్రాఫిక్‌కు అంతరాయం

2లో

## రూ.50 వేలు ఇస్తేనే ఇల్లు మంజూరు చేస్తాం

### లేకపోతే పేరును రద్దు చేస్తాం

- డబ్బు డిమాండ్ చేసిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు

## దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం ప్లాన్


- పూర్తిగా మారనున్న రాజకీయ ముఖచిత్రం
- 2027 నాటికి జనాభా లెక్కలు.. ఆపై కొత్త స్థానాల ప్రకటన
- పునర్విభజన ప్రక్రియ పూర్తయ్యాకే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు
- తెలుగు రాష్ట్రాల్లోనూ భారీ మార్పు
- పరిధి తగ్గి ప్రజలకు పాలన చేరువ చేయడమే లక్ష్యం

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక చారిత్రాత్మక ఘట్టానికి తెరలేవబోతోంది! దశాబ్దాలుగా మారని చట్టసభల రూపురేఖలను సమూలంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం అత్యంత భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను ఏకంగా 50 శాతం మేర పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. కేవలం స్థానాల పెంపు మాత్రమే కాదు.. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికే మహిళా రిజర్వేషన్లను క్షేత్రస్థాయిలో అమలు చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ భారీ వ్యూహాన్ని రచిస్తోంది. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే దీనికి సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు వచ్చే అవకాశం ఉండటంతో దేశ రాజకీయ వర్గాల్లో ఒక్కసారిగా ప్రకంపనలు మొదలయ్యాయి.

2లో





**లోక్‌సభ స్థానాలు**

ప్రస్తుతం 543

పెరిగే అవకాశం 816

**అసెంబ్లీ స్థానాలు**

ప్రస్తుతం 4123

పెరిగే అవకాశం 6185

**తెలంగాణలో..**

అసెంబ్లీ స్థానాలు: 119 నుంచి 179కి..

లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కి..

**ఆంధ్రప్రదేశ్‌లో..**

అసెంబ్లీ స్థానాలు: 175 నుంచి 263కి..

లోక్‌సభ స్థానాలు: 25 నుంచి 38కి..

# ఢిల్లీ టూ గల్లీ

## ప్రియుడి కోసం తల్లిని చంపేసింది..



### ప్రేమ వ్యవహారమే హత్యకు కారణమని పోలీసుల వెల్లడి

- ఏడాది తర్వాత వెలుగులోకి వచ్చిన దారుణం
- బైక్ అమ్మకానికి వెళ్లడంతో బయటపడిన నిజం

2లో

## మానసిక క్షోభ అనుభవిస్తున్నా..



- పార్టీలో సరైన ప్రాధాన్యత దక్కలేదు
- ఫిరాయింపుల ప్రోత్సాహానికి నేను విరుద్ధం
- సీఎం రేవంత్ తీరు బాగోలేదు
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి
- కార్యకర్తల సమక్షంలో పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా
- హైకమాండ్ తీరుపైనా విమర్శలు

2లో



## నాలాను మింగేసిన జనతా బార్

- సిరిసిల్ల నడిబొడ్డున బహిరంగ కబ్జా
- ప్రభుత్వ భూమిపై యథేచ్ఛగా నిర్మాణం
- కాలువ మాయం.. అధికారుల మౌనం
- పట్టణానికి పొంచి ఉన్న వరద ముప్పు
- సిరిసిల్ల కామారెడ్డి రోడ్డుపై భూదందా

**వేద న్యూస్, సిరిసిల్ల టౌన్**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూముల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. పట్టణం నడిబొడ్డున ఓ ప్రధాన నాలాను ఏకంగా కబ్జా చేసి, అక్కడ జనతా బార్ నిర్మించిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. కాలువ ఆనవాళ్లను సైతం మాయం చేసి అక్రమ నిర్మాణం చేపట్టడం ఇప్పుడు పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది. బీవై నగర్ పరిధిలోని రాయిన్ చెరువు పరిసరాల్లో ఈ అక్రమ ఉదంతం వెలుగులోకి వచ్చింది. చెరువుకు అనుబంధంగా ఉన్న కాలువలను క్రమక్రమంగా ఆక్రమిస్తూ, చివరకు ఒక వ్యక్తి ఏకంగా నాలా స్థలాన్నే కబ్జా చేసి బార్ నిర్మించారు. కాలువను పూర్తిగా పూడ్చివేసి, దాని ఉనికిని కూడా లేకుండా చేసి ఈ భారీ నిర్మాణం చేపట్టడం గమనార్హం.

**వరద ముప్పుపై స్థానికుల ఆందోళన**

సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న గోపాల్ నగర్ ప్రాంతంలో ఈ కబ్జా చోటుచేసుకుంది. పట్టణ డ్రైనేజీ వ్యవస్థకు కీలకమైన ఈ నాలాను ధ్వంసం చేయడం వల్ల భవిష్యత్తులో వర్షాకాలంలో తీవ్రమైన వరద ముప్పు పొంచి ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. సహజంగా నీరు వెళ్లాల్సిన మార్గం మూసుకుపోవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల మౌనం.. విమర్శల పర్వం**

కళ్లముందే రోజుకో అడుగు ముందుకు వేస్తూ నిర్మాణం పూర్తి కావస్తున్నా, సంబంధిత శాఖల అధికారులు కనీసం అటువైపు చూడకపోవడం విమర్శలకు దారితీస్తోంది. అసలు ఇంత పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణం జరుగుతుంటే యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు ఎందుకు వ్యవహరిస్తోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల పరోక్ష సహకారంతోనే ఈ భూదందాలు సాగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**తక్షణ చర్యలకు ప్రజల డిమాండ్**

ప్రజల అవసరాల కోసం ఉంచిన ప్రభుత్వ వనరులు ఇలా ప్రైవేటు వ్యక్తుల పరం కావడం అభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారుతోందని పౌర సమాజం మండిపడుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, ఆక్రమణను తొలగించి కాలువను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి కబ్జాలకు అడ్డుకట్ట పడుతుందని స్థానికులు కోరుతున్నారు.

# అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత

- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు ఎస్ఎఫ్ఐ ఆందోళన
- కంట్రోల్ రూమ్ సిగ్నల్ వద్ద విద్యార్థి నేతల అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కొద్ది సేపు ట్రాఫిక్‌కు అంతరాయం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ అసెంబ్లీ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. విద్యార్థుల ఆందోళనతో పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఆందోళనను అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. కంట్రోల్ రూమ్ సిగ్నల్ వద్ద ఎస్ఎఫ్ఐ నేతలను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. పరిస్థితి అదుపులో ఉండేలా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడంలో ఆలస్యం అవుతుండటంతో విద్యార్థుల్లో అసంతృప్తి పెరుగుతోందని ఆందోళనకారులు తెలిపారు. తక్షణమే బకాయిలను విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కారణంగా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించి పరిస్థితిని సద్దుమణిగేలా చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు కోరుతున్నారు.

# శాసనసభలో ‘వందేమాతరం’ వివాదం

- ఎంఐఎం ఎమ్మెల్యేలపై చర్యలు కోరిన రామ్‌చందర్ రావు
- గవర్నర్‌కు వినతిపత్రం సమర్పణ
- జాతీయ గౌరవాన్ని కాపాడాలని డిమాండ్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ శాసనసభలో ‘వందేమాతరం’ గీతాన్ని బహిష్కరించిన ఎంఐఎం ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు ఎన్ రామ్‌చందర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. సభలో జరిగిన ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శాసనసభ వంటి ప్రజాస్వామ్య వేదికలో జాతీయ గీతాన్ని అవమానించే విధంగా ప్రవర్తించడం అనేది తగదని రామ్‌చందర్ రావు అన్నారు. ఎంఐఎం ఎమ్మెల్యేల ప్రవర్తన దేశభక్తి భావనలను దెబ్బతీసే విధంగా ఉందని విమర్శించారు. ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సభలో క్రమశిక్షణను కాపాడటం స్పీకర్ బాధ్యత అని, ఈ నేపథ్యంలో సంబంధిత ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నియమాలు, సంప్రదాయాలను గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతగా పేర్కొన్నారు. జాతీయ గౌరవానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి రాజీ ఉండకూడదని రామ్‌చందర్ రావు స్పష్టం చేశారు. ‘వందేమాతరం’ గీతం దేశభక్తికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. శాసనసభలో జరిగిన ఈ ఘటనపై ప్రభుత్వం, సంబంధిత వర్గాలు ఎలా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

# వడగళ్ల వాన..

- హైదరాబాద్‌లో అకాల వర్షం.. రోడ్లపై నిలిచిన నీరు
- రంగారెడ్డికి రెడ్ అలర్ట్.. పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక
- రైతుల్లో మొదలైన కలవరం

**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలో అకాల వర్షాలు కురుస్తూ వాతావరణాన్ని ఒక్కసారిగా మార్చేశాయి. వనస్థలిపురం, హయత్‌నగర్, గాయత్రీనగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో వడగళ్ల వాన పడటంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. ఎండ వేడిమి నుంచి కొంత ఉపశమనం లభించినప్పటికీ, ఆకస్మిక వర్షాలతో రహదారులపై నీరు నిలిచిపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తాయి. ఘట్‌కేసర్, అన్నోజిగూడ, నారపల్లి ప్రాంతాల్లో కూడా భారీ వర్షం కురుస్తోంది. మధ్యాహ్నం సమయంలో ప్రారంభమైన వర్షం కొద్దిసేపు తగ్గినా, సాయంత్రం మళ్లీ ఉధృతంగా కురవడం ప్రారంభమైంది. కొన్ని ప్రాంతాల్లో గాలులు కూడా బలంగా వీయడంతో చెట్లు, విద్యుత్ లైన్లకు నష్టం వాటిల్లే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా రంగారెడ్డి జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. అదే విధంగా నారాయణపేట, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్, మంచిర్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వడగళ్ల వాన కారణంగా కొన్ని ప్రాంతాల్లో పంటలు, వాహనాలు కూడా దెబ్బతిన్నట్లు సమాచారం. రహదారులపై నీరు నిలవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

# ఢిల్లీ టూ గల్లీ..

## దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం ప్లాన్

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

భారత రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగులు వేస్తోంది. దేశవ్యాప్తంగా చట్టసభల ప్రాతినిధ్యాన్ని పెంచడంతో పాటు, దశాబ్దాలుగా నానుతున్న మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేసేందుకు ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోనే దీనికి సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఓటర్లకు, ప్రజా ప్రతినిధులకు మధ్య దూరాన్ని తగ్గించేలా లోక్‌సభ మరియు అసెంబ్లీ స్థానాలను దాదాపు 50 శాతం మేర పెంచాలని కేంద్రం నిర్ణయించింది.



### భారీగా పెరిగే అవకాశం

ఈ ప్రతిపాదన ప్రకారం.. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాల సంఖ్య ఏకంగా 816కు చేరనుంది. అలాగే దేశవ్యాప్తంగా ఉన్న 4,123 అసెంబ్లీ స్థానాల సంఖ్య 6,185కు పెరుగుతుంది. గతంలో మహిళా రిజర్వేషన్ బిల్లు (నారీ శక్తి వందన్ అధినియం) ఆమోదం పొందినప్పటికీ, అది జనాభా లెక్కలు మరియు నియోజకవర్గాల పునర్విభజన (డెలిమిటేషన్) తర్వాతే అమలు కావాల్సి ఉంది. అయితే, ఈ ప్రక్రియ ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో, 2011 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకుని పునర్విభజనను పూర్తి చేయాలని కేంద్రం భావిస్తోంది. తద్వారా 2029 సార్వత్రిక ఎన్నికల నాటికే 33 శాతం మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలనేది ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.

### తెలుగు రాష్ట్రాల్లో మారనున్న సమీకరణలు

ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుండి వస్తున్న అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ఒక మధ్యేమార్గాన్ని ఎంచుకుంది. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్లు పెంచితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళనల నేపథ్యంలో.. ప్రతి రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న స్థానాలపై సమానంగా 50 శాతం సీట్లను పెంచాలని నిర్ణయించింది. దీనివల్ల తెలుగు రాష్ట్రాల్లో భారీ మార్పులు రానున్నాయి. తెలంగాణలో అసెంబ్లీ స్థానాలు 119 నుండి 179కి, ఆంధ్రప్రదేశ్‌లో 175 నుండి 263కి పెరిగే అవకాశం ఉంది. అలాగే లోక్‌సభ స్థానాల విషయంలో కూడా తెలంగాణకు 26, ఏపీకి 38 స్థానాలు దక్కే వీలుంది.

### కొత్త పార్లమెంట్ భవనం కూడా అందుకే

ఈ భారీ మార్పుల కోసం కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే విపక్షాలు మరియు ఎన్డీయే మిత్రపక్షాలతో చర్చలు ప్రారంభించారు. కొత్తగా నిర్మించిన పార్లమెంట్ భవనం కూడా పెరిగే సభ్యుల సంఖ్యకు అనుగుణంగానే నిర్మించబడటం గమనార్హం. 2027 మార్చి నాటికి జనాభా లెక్కల ప్రక్రియను పూర్తి చేసి, ఆ నివేదిక ఆధారంగా నియోజకవర్గాల సరిహద్దులను ఖరారు చేయనున్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం అమల్లోకి వస్తే, రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడమే కాకుండా, సామాన్య ప్రజలకు తమ ప్రతినిధులు మరింత అందుబాటులో ఉండే అవకాశం ఉంటుంది.

**పూర్తిగా మారనున్న రాజకీయ ముఖచిత్రం**

- 543 స్థానాల నుంచి 816కు చేరనున్న లోక్‌సభ స్థానాలు
- అసెంబ్లీ స్థానాల సంఖ్య 4,123 నుంచి 6,185 పెరిగే చాన్స్
- తెలంగాణలో అసెంబ్లీ స్థానాలు 179కి.. ఎంపీలు 26 చేరే అవకాశం..
- 2027 నాటికి జనాభా లెక్కలు.. ఆపై కొత్త స్థానాల ప్రకటన
- పునర్విభజన ప్రక్రియ పూర్తయ్యాకే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు
- తెలుగు రాష్ట్రాల్లోనూ భారీ మార్పు
- పరిధి తగ్గి ప్రజలకు పాలన చేరువ చేయడమే లక్ష్యం

# ప్రియుడి కోసం తల్లిని చంపేసింది..

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ పరిధిలో ఏడాది క్రితం జరిగిన ఓ మహిళ అదృశ్య ఘటన ఇప్పుడు హత్య కేసుగా బయటపడింది. తన ప్రియుడి కోసం తల్లినే హతమార్చిన కూతురు ఘటన సంచలనంగా మారింది. మే 2025లో మంజు అనే మహిళ కనిపించడం లేదని, ఆమె బైక్ కూడా కనిపించడం లేదని ఆమె పెద్ద కూతురు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ సమయంలో పోలీసులు అనేక కోణాల్లో దర్యాప్తు చేపట్టినప్పటికీ ఎలాంటి స్పష్టమైన ఆధారాలు లభించలేదు. దీంతో మంజు ఆచూకీ గుట్టు వీడకపోయింది. కేసు నిలిచిపోయినట్లే కనిపించినప్పటికీ తాజాగా జరిగిన ఒక సంఘటనతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇటీవల మంజుకు చెందిన బైక్‌ను రాంకోఠిలోని ఒక దుకాణంలో అమ్మేందుకు మౌంటీ రాజ్‌పుత్ అనే వ్యక్తి వెళ్లాడు. అతను ఇచ్చిన సమాధానాలు అనుమానాస్పదంగా ఉండటంతో షాపు యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు రాజ్‌పుత్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి. మంజు చిన్న కూతురు ఇషికాతో తాను ప్రేమలో ఉన్నానని, తమ సంబంధాన్ని మంజు అంగీకరించకపోవడంతో ఆమెను ఇద్దరం కలిసి హత్య చేశామని రాజ్‌పుత్ ఒప్పుకున్నాడు. హత్య అనంతరం ఈ విషయం బయటపడకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు వెల్లడించారు. తన తల్లిని హతమార్చిన తర్వాత ఏడాది పాటు ఏమీ తెలియనట్లుగా ఇషికా నటించిందని పోలీసులు తెలిపారు. చివరకు బైక్ అమ్మకానికి వెళ్లిన సమయంలో అనుమానం రావడంతో కేసు బయటపడిందని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

**ప్రేమ వ్యవహారమే హత్యకు కారణమని పోలీసుల వెల్లడి**

- ఏడాది తర్వాత వెలుగులోకి వచ్చిన దారుణం
- బైక్ అమ్మకానికి వెళ్లడంతో బయటపడిన నిజం







# రూ.50 వేలు ఇస్తేనే ఇల్లు మంజూరు చేస్తాం

## లేకపోతే పేరును రద్దు చేస్తాం

- డబ్బు డిమాండ్ చేసిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు
- చర్యలు తీసుకోవాలని బాధితురాలి విజ్ఞప్తి
- వర్షానికి కూలే ఇంట్లో జీవనం

**వేద న్యూస్, కారేపల్లి**

ఐటీడీఏ కోటాలో ఇల్లు మంజూరు విషయంలో అవినీతి ఆరోపణలు సింగరేణి మండలంలో వెలుగులోకి వచ్చాయి. అర్హత సాధించి లబ్ధిదారుల జాబితాలో మొదటి స్థానంలో ఉన్న బానోతు విజయకు ఇల్లు మంజూరులో అక్రమాలు జరుగుతున్నాయని ఆమె ఆరోపించింది. బాధితురాలి ప్రకారం.. ఇందిరమ్మ కమిటీకి చెందిన ఓ సభ్యుడు రూ.50 వేల రూపాయలు చెల్లిస్తేనే ఇల్లు మంజూరు చేస్తామని, లేకపోతే పేరును రద్దు చేస్తామని బెదిరించినట్లు తెలిపింది. ఇద్దరు చిన్నారులతో జీవనం సాగిస్తున్న విజయ ప్రస్తుతం వర్షాల్లో కూలిపోతున్న ఇంటిలో నివసిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. అత్యవసరంగా ఇల్లు అవసరమైనప్పటికీ, అవినీతి కారణంగా ఆలస్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారానికి సంబంధించి తన వద్ద ఆధారాలు ఉన్నాయని పేర్కొంటూ, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరింది. ఇలాంటి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# 20 నెలలుగా పార్టీలో మానసిక క్షోభ అనుభవిస్తున్నా..

**వేద న్యూస్, జగిత్యాల**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. జగిత్యాలలో కార్యకర్తల సమక్షంలో తన రాజీనామా లేఖను విడుదల చేసిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ హైకమాండ్ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. గత 20 నెలలుగా పార్టీలో తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతున్నానని జీవన్ రెడ్డి వెల్లడించారు. గౌరవం లేని చోట కొనసాగడం సాధ్యం కాకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ లోపల తనకు సరైన ప్రాధాన్యత లభించలేదని, తన భావాలను పట్టించుకోలేదని ఆరోపించారు. తెలంగాణలో ఫిరాయింపులను ప్రోత్సహించడం పార్టీ విధానాలకు విరుద్ధమని జీవన్ రెడ్డి మండిపడ్డారు. ముఖ్యంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను పార్టీలోకి తీసుకోవడం, ఆయనకు ప్రాధాన్యత ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను పక్కన పెట్టి, కొత్తగా వచ్చిన వారికి ప్రాముఖ్యత ఇస్తున్నారని విమర్శించారు. తనకు అండగా ఉన్న కీలక నాయకుడు మరణించిన సమయంలో ముఖ్యమంత్రి పరామర్శించలేదని, తనకు మద్దతుగా నిలబడలేదని జీవన్ రెడ్డి ఆరోపించారు. ఈ కారణాల వల్లే పార్టీపై నమ్మకం కోల్పోయానని, ఇకపై రేవంత్ రెడ్డి విధానాలపైనే తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మరోవైపు, జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చివరి వరకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. జీవన్ రెడ్డి తన నిర్ణయానికే కట్టుబడి ఉండగా, జగిత్యాల నియోజకవర్గంలో ఆయనకు ఉన్న బలమైన కేడర్ ఇప్పుడు ఆయన వెంట నడిచే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

- పార్టీలో సరైన ప్రాధాన్యత దక్కలేదు
- ఫిరాయింపుల ప్రోత్సాహానికి నేను విరుద్ధం
- సీఎం రేవంత్ తీరు బాగోలేదు
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి
- కార్యకర్తల సమక్షంలో పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా
- హైకమాండ్ తీరుపైనా విమర్శలు

# కొత్త పథకం అమలు ఎప్పుడు?

## కేసీఆర్ కిట్ నిలిపివేతపై హరీష్ రావు ఫైర్

**వేద న్యూస్, హైదరాబాద్**

కేసీఆర్ కిట్ పథకాన్ని నిలిపివేసి దాని స్థానంలో కొత్త పథకం తీసుకొస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు అమలు చేయకపోవడంపై బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్ రావు తీవ్రంగా ప్రశ్నించారు. ప్రజలకు నేరుగా లాభం చేకూర్చే ఈ కీలక పథకం నిలిచిపోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త పథకం ఎప్పుడు ప్రారంభిస్తారో స్పష్టమైన గడువు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్ నిలిపివేసిన తరువాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు హరీష్ రావు పేర్కొన్నారు. సుమారు 20 శాతం మేర డెలివరీలు తగ్గడం ఆరోగ్య వ్యవస్థకు ప్రమాద సంకేతమని ఆయన అభిప్రాయపడ్డారు.

వేద న్యూస్

గురువారం మార్చి 26, 2026

## వేములవాడలో ఈ-సేవ కేంద్రం ఏర్పాటు చేయాలి

**- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీధర్**



**వేద న్యూస్, వేములవాడ రూరల్:**

వేములవాడలో ప్రభుత్వ ఈ-సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గురుజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంగా సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజలకు ఆన్‌లైన్ సేవలు అత్యంత కీలకంగా మారాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈ సేవ కేంద్రం సిరిసిల్ల పట్టణానికే పరిమితం కావడంతో వేములవాడ డివిజన్‌కు చెందిన ప్రజలు అనేక సేవల కోసం సిరిసిల్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అదేవిధంగా ప్రైవేట్ మీ సేవ కేంద్రాలు నియంత్రణ లేకుండా అధిక చార్జీలు వసూలు చేస్తున్నాయని, దీనివల్ల వినియోగదారులపై ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, వేములవాడ పట్టణంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ-సేవ కేంద్రాన్ని యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## డా. అనితా రెడ్డికి గ్లోబల్ విజనరీ ఉమెన్ అవార్డు



**వేద న్యూస్, హనుమకొండ:**

సమాజ సేవలో విశేష కృషి చేసినందుకు డా. అనితా రెడ్డికి గ్లోబల్ విజనరీ ఎంట్రప్రెన్యూరియల్ ఎంపవర్‌మెంట్ చేంజ్ లీడర్ ఉమెన్ అవార్డు-2026 ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. అను రాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వ విద్యాలయం పాలక మండలి సభ్యురాలు, వరల్డ్ వైజ్ కన్జ్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న డా. అనితా రెడ్డి గత 30 ఏళ్లుగా అనాథలు, దివ్యాంగులు, మహిళలు, వృద్ధుల కోసం నిస్వార్థంగా సేవలందిస్తున్నారని గుర్తించి ఈ గౌరవాన్ని అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ డా. చక్రవర్తి మాట్లాడుతూ, మహిళా సాధికారతకు దారితీసే మార్పుకు నాయకత్వం వహించిన గ్లోబల్ స్థాయి మహిళలకు ఈ అవార్డు అందజేస్తామని తెలిపారు. సమాజంలో సానుకూల మార్పుకు కృషి చేసిన విశిష్ట మహిళగా డా. అనితా రెడ్డి ఎంపిక కావడం తమకు గర్వకారణమని అన్నారు. అవార్డు స్వీకరించిన డా. అనితా రెడ్డి మాట్లాడుతూ, ఈ గౌరవం తన సేవలకు గుర్తింపుగా భావిస్తున్నానని, భవిష్యత్తులో మరింతగా సమాజహిత కార్యక్రమాలు చేపట్టి అవసరమైన వారికి అండగా నిలుస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## భద్రకాళి ఆలయానికి ఎల్ఈడీ లైట్లు, ఎలక్ట్రికల్ సామగ్రి అందజేత



**వేద న్యూస్, హనుమకొండ:**

నగరంలోని ప్రసిద్ధ భద్రకాళి దేవస్థానానికి కాసం ఫ్యాషన్స్ అధినేత కాసం నమ శ్శివాయ, రమేష్ బాబు కలిసి 16 ఎల్ఈడీ లైట్లు మరియు ఇతర ఎలక్ట్రికల్ సామగ్రి కొనుగోలుకు రూ.20 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో రామల సునీత, ఆలయ సూపరింటెండెంట్ క్రాంతికుమార్ సమక్షంలో ధర్మకర్తలు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, తోనుపునూరి వీరన్న, ఓరుగంటి పూర్ణ, మోత్కూరి మయూరిరామేశ్వర్, జారతి వెంకన్న, పాలడుగుల ఆంజనేయులు, తొగురు క్రాంతి, గాండ్ల స్రవంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



**వేద న్యూస్, మందమర్రి:**

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మంచిర్యాల జిల్లా కన్వీనర్ కొలుగూరి విజయకుమార్, కో కన్వీనర్ వెంకటేశం గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నిజమైన ఉద్యమకా రు లను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు, ఆసరా పెన్షన్ లు కల్పించాలని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు స్వాతంత్ర సమరయోధులతో సమానంగా గుర్తించి పెన్షన్లు ఇవ్వాలని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మండల, జిల్లా కేంద్రాలలో 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉద్యమకారులను గుర్తించి కార్డులు అందజేయాలని, ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం, ఉపాధి కోసం పది లక్షల రూపాయలు మంజూరు, ఎఫ్ ఐ ఆర్ తో సంబంధం లేకుండా బైండోవర్ అయినవారికి, రాష్ట్ర సాధన ఉద్యమంలో పనిచేసిన వారికి సంక్షేమ పథకాలు చేయాలని డిమాండ్ చేశారు. మరి కొద్ది రోజులలో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి పట్టణ కమిటీ, మండల కమిటీ లను ఎన్నుకుంటా మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఇన్చార్జి లక్షట్ పేట నివాసి వేనుగంటి రవీందర్, బత్తుల సరిత, క లిం రిపోర్టర్, దాసరి రాజనర్సు, పల్లె నరసిం హులు, ఫోలు కుమార్, వలిగిరి కనకరాజు, నీరటి శ్రీశైలం, నామని ముత్తయ్య, పెను గొండ సమ్మయ్య, కొండిల్ల శ్రీనివాస్, ఎండి పాషా, తోగరి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ దీక్షధారులకు భిక్షా కార్యక్రమం

**- సేవ చేయడం స్వామివారి వరం: చల్మెడ లక్ష్మీనరసింహారావు**

**వేద న్యూస్, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం శ్రీ జోడి ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం హనుమాన్ దీక్ష స్వాములకు భిక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వయంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు స్వాములకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ దీక్ష స్వాములు నియమ నిష్టలతో మాలధారణ చేసి ఆంజనేయ స్వామిని భక్తిశ్రద్ధలతో కొలవడం శుభ పరిణామమని అన్నారు. స్వామివారి సేవలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్



హరిచరణ్ రావు, సర్పంచ్ సంజన మహేష్, ఈర్నాల రాజు, నాయిని రవి, నాగారం బాలరాజు, ఆర్‌సి రావు, రామతీర్థపు రాజు, వెంగళ శ్రీకాంత్ గౌడ్, సిరిగిరి చందు తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య శిబిరం విజయవంతం

**- 227 మందికి పరీక్షలు, మందుల పంపిణీ**



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎంపీడీవో జయశీల, ఎమ్మార్వో నారాయణ రెడ్డి, ఎంపీవో శ్రీధర్, సర్పంచ్ నల్లమోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించుకోవాలని సూచించారు. శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు సేవలు అందించారు. పిల్లల విభాగంలో 38, గైనకాలజీ 7, కంటి విభాగంలో 33, జనరల్ మెడిసిన్‌లో 60, డెంటల్‌లో 28, ఆర్థోపెడిక్‌లో 64 మందిని పరీక్షించారు. మొత్తం 227 మందికి మందులు పంపిణీ చేసి వైద్య సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు డా. ఆర్. కార్తీక్, సూపర్వైజర్ హేమలత, ఫార్మసీ ఆఫీసర్ రాజ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ భాస్కర్, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ బ్యాంకు సీఈవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**వేద న్యూస్, హనుమకొండ:**

వరంగల్ డీసీసీ బ్యాంకు సీఈవో వాజీర్ సుల్తాన్‌పై మత వివక్షకు పాల్పడుతున్నారంటూ హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాష్ట్రీయ హిందూ పరిషత్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మండల భూపాల్ మాట్లాడుతూ, బ్యాంకు ఉద్యోగుల మధ్య మత ప్రాతిపదికన విభజన సృష్టిస్తున్నారని ఆరోపించారు. హిందూ పండుగల సమయంలో సాధారణ సెలవులు అమలు చేస్తున్నప్పటికీ, రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు మాత్రమే సెలవులు ఇచ్చి, హిందూ ఉద్యోగులకు విధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే హిందూ ఉద్యోగులు తీర్థయాత్రల కోసం సెలవులు కోరితే నిరాకరించగా, ముస్లిం ఉద్యోగులకు వెంటనే మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగులను మతాల వారీగా విడదీసి విధులు కేటాయించడం, ప్రశ్నించిన వారిపై చర్యలు తీసుకుంటామని బెదిరించడం జరుగుతోందని ఆరోపించారు. ఈ పరిస్థితుల వల్ల ఉద్యోగులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని, కార్యాలయాల్లో సమానత్వ వాతావరణం కల్పించేందుకు తక్షణ విచారణ జరిపి సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని



కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు చీకటి రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడిపోజు సంతోష్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పల్లపు అశోక్, ఇతర నాయకులు పాల్గొన్నారు

## ఏదులలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**- గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రారంభం**

**వేద న్యూస్, ఏదుల:**

ఏదుల మండల కేంద్రంలోని నీళ్ల ట్యాంక్ సమీపంలో సీసీ రోడ్డు మరమ్మత్తు పనులను గ్రామపంచాయతీ పాలక మండలి ఆధ్వర్యంలో ప్రారంభించారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృషితో మండల కాంగ్రెస్ నాయకులు పందెం సుఖేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పరశురామ్ యాదవ్ సమక్షంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి రోడ్డు సౌకర్యాలు కీలకమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ యాదవ్, ఉప సర్పంచ్ ఉల్పాల శేశిరెడ్డి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు జానకిరామ్ యాదవ్, వార్డు సభ్యులు కాశమ్మ సైదులు, రాముడు యాదవ్, మల్లయ్య యాదవ్, బొల్లె



కృష్ణయ్య, మాజీ వార్డు సభ్యుడు హుస్సేన్, హనుమంతు, బీచుపల్లి, దూరల రాముడు, కావాలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్

**వేద న్యూస్, మహాదేవపూర్ :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మహాముత్తారం మండలం పెగడపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కలిసి ప్రారంభించారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని కాటారం, మహాముత్తారం, మహాదేవపూర్, మలహర్ రావు, పలిమెల మండలాల నుంచి సుమారు 5 వేల మందికిపైగా ప్రజలు వాహనాల ద్వారా శిబిరానికి చేరుకొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ఆస్పత్రులకు చెందిన వివిధ విభాగాల వైద్యులు పాల్గొని ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. శిబిరానికి వచ్చిన ప్రజల కోసం అవసరమైన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అనంతరం ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, ముఖ్యంగా గిరిజన గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని



ఈ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

వేద న్యూస్

గురువారం మార్చి 26, 2026

# గంగాదేవి కోరగుట్ట తవ్వకాలు..పర్యావరణానికి నష్టం

## – అధికారులు స్పందించాలని సర్పంచ్ ఉండం రాఘవులు డిమాండ్

**వేద న్యూస్, కారేపల్లి:**



కారేపల్లి మండలంలోని గుట్ట కింద గుంపు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గంగాదేవి కోరగుట్ట తవ్వకాలపై వివాదం నెలకొన్న నేపథ్యంలో గ్రామపంచాయతీ సర్పంచ్ ఉండం రాఘవులు గ్రామ ప్రజలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి పలు అంశాలపై మాట్లాడారు. తమ గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న గంగాదేవి కోరగుట్ట మట్టి తవ్వకాలపై పూర్తి వివరాలు అధికారులు వెల్లడించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉండం రాఘవులు మాట్లాడుతూ, గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గుట్టలు, సహజ వనరులు ప్రభుత్వానికి మరియు గ్రామ ప్రజలకు చెందినవని, వాటి తవ్వకాల విషయంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. గోదాం నిర్మాణానికి సంబంధించిన వర్క్ ఆర్డర్ పేరుతో గంగాదేవి కోరగుట్ట నుండి మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయని, అయితే ఆ వర్క్ ఆర్డర్‌లో గుట్ట తవ్వకానికి ప్రత్యేక అనుమతి ఉందా లేదా అన్నది స్పష్టంగా తెలియాల్సి ఉందని తెలిపారు. మట్టి తవ్వకాలకు సంబంధిత శాఖల అనుమతులు, రాయల్టీ చెల్లింపులు, ట్రాన్సిట్ పాస్ వంటి ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సి ఉంటుందని, ఇవి ఉన్నాయా లేదా అన్న విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా సహజ వనరులను తరలిస్తే ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగే అవకాశం ఉందని, అలాగే పర్యావరణానికి కూడా నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. గ్రామ ప్రజలు కూడా ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, గంగాదేవి కోరగుట్ట తవ్వకాలపై నిజానిజాలు వెలుగులోకి రావాలని గ్రామ ప్రజల తరఫున అధికారులను కోరుతున్నామని సర్పంచ్ తెలిపారు. అవసరమైతే సమాచార హక్కు చట్టం ద్వారా పూర్తి వివరాలు సేకరిస్తామని, గ్రామ ప్రయోజనాలను కాపాడటానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పాల్గొని గంగాదేవి కోరగుట్ట తవ్వకాలపై పూర్తి విచారణ జరిపి నిజాలు బయటపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామ ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు.

# డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

## – మంత్రి దామోదర రాజనర్సింహకు సన్మానం



**వేద న్యూస్, హైదరాబాద్:**

డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు బిల్లును రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించడంతో వైద్యులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. 1986లో ఏర్పాటు చేసిన వైద్య విధాన పరిషత్ స్థానంలో కొత్త డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని చిరకాలంగా డిమాండ్ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు ఈ అంశం ప్రతిపాదనల దశలోనే ఆగిపోయినప్పటికీ, ఐక్యవేదికగా పోరాటం చేసి ఈ విజయాన్ని సాధించామని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఐక్యవేదిక ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. సమస్యను సానుకూలంగా పరిష్కరించినందుకు మంత్రి, కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల ప్రజలకు అందే వైద్య సేవల్లో మెరుగులు దిద్దుకునే అవకాశముందని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో శాస్త్రీయమైన కేడర్ నిర్మాణంతో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణతో పాటు సమాజ సేవలోనూ పోలీసులు

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**



విధి నిర్వహణతో పాటు సమాజ సేవలోనూ తాము ముందుంటామని ఓ కానిస్టేబుల్ నిరూపించారు. మండుటెండలో రోడ్డు దాటడానికి ఇబ్బంది పడుతున్న వృద్ధురాలికి ఏఆర్ (స్పెషల్ పార్టీ) కానిస్టేబుల్ సహాయం చేసి తన మానవత్వం చాటుకున్నారు. బుధవారం కాజీపేట ఫాతిమా జంక్షన్ వద్ద ఎండలో రోడ్డు దాటేందుకు అవ్వ ఇబ్బంది పడుతోంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఆమెను గమనించాడు. వెంటనే అవ్వని రోడ్డు దాటించి..ఎక్కడకి వెళ్లాలి అని అడిగి ఆటోలో ఎక్కించి పంపించాడు.

# పాలిటెక్నిక్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు

## – 29న ఆత్మీయ సమ్మేళనం




**వేద న్యూస్, వరంగల్:**

వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు మార్చి 29న ఘనంగా నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఇ.వి. శ్రీనివాస్ రావు తెలిపారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 1955 నుండి ప్రస్తుత విద్యార్థుల వరకు సుమారు 70 ఏళ్ల పూర్వ విద్యార్థులను ఒకే వేదికపై కలిపే ఆత్మీయ సమ్మేళనంగా ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. పాత జ్ఞాపకాలను స్మరించుకునే ఈ వేడుకలకు పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు మేకల అక్షయ్ కుమార్, ఆనంద్ కుమార్, జయశ్రీ, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**



చిన్నచింతకుంట మండలం దమగ్నపురం గ్రామంలో ఓఎంఐఎఫ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే స్వర్ణ సుధాకర్ రెడ్డి, కవిత మధుసూదన్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ పేద మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా ప్రతినిధి హాజమ్మ, కోఆర్డినేటర్ ఎల్లప్ప, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర చట్టం ఉపసంహరణకు నిరసన

**వేద న్యూస్, మెట్‌పల్లి:**

పెన్షనర్లకు నష్టదాయకంగా ఉన్న గత సంవత్సరం మార్చి 25 నాటి కేంద్ర ప్రభుత్వ చట్టాన్ని ఉపసంహరించాలని తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవోకు మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, ఈ చట్టం పెన్షనర్ల హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నందగోపాల్, కోశాధికారి చిన్నయ్య, అసోసియేట్ అధ్యక్షులు నర్సయ్య, కొండగట్టు, గంద్ర ఆనందరావుతో పాటు పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.



– ఆర్డీవోకు పెన్షనర్ల మెమోరాండం సమర్పణ

# అంగన్వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

**వేద న్యూస్, మహాదేవపూర్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో అంగన్వాడీ భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. గ్రామ సర్పంచ్ ఏల్పుల సరిత ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సతీష్, ఉప సర్పంచ్ లచ్చిరెడ్డి, వార్డు సభ్యులు సంతోష్, తేజస్విని, శ్రావణి, దేవిక, మనక్క, గ్రామ కార్యదర్శి స్వాతి, అంగన్వాడీ టీచర్లు సుచరిత, శ్రీకళ, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ భవనం నిర్మాణ పనులను నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గ్రామంలోని పిల్లలు, గర్భిణీ స్త్రీలకు మెరుగైన సేవలు అందించేలా భవనం ఉపయోగపడుతుందని తెలిపారు.

# ఎంపియుపిఎస్ పాఠశాలను సందర్శించిన సబ్ కలెక్టర్

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో గల ఎంపియుపిఎస్ పాఠశాలను బుధవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించి, విద్యార్థుల గైర్హాజరు తగ్గించేందుకు సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అదనంగా 3వ తరగతి, 6వ తరగతి విద్యార్థుల మిడ్‌లైన్, ఎండ్‌లైన్ పరీక్ష పత్రాలను పరిశీలించారు. విద్యార్థులు చదవడం, వ్రాయడం నైపుణ్యాలను కూడా అంచనా వేసి, వాటిని మెరుగుపరచడానికి కేంద్రీకృత ప్రయత్నాలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల మొత్తం ప్రదర్శన సంతృప్తికరంగా లేదని గమనించారు. ఉపాధ్యాయులు పీరియడ్ ప్లాన్ ప్రకారం వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అలాగే టీచర్ సపోర్ట్ గ్రూప్ విద్యార్థులకు అదనపు శ్రద్ధ చూపించి వారి అభ్యాస ఫలితాలను మెరుగుపరచాలని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ వెంట ఎంఈఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి

**వేద న్యూస్, రుద్రూర్ :**



ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని రుద్రూర్ ఎస్సై సాయన్న వాహనదారులకు సూచించారు. రుద్రూర్ గ్రామ శివారులో వాహనాల తనిఖీల్లో భాగంగా బుధవారం రుద్రూర్ ఎస్సై సాయన్న వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలు, హెల్మెట్ పై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, యువకులు, వాహనదారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**



చిన్నచింతకుంట మండలంలోని లాలుకోట, చిన్న చింతకుంట, నెల్లికొండి గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను మహబూబ్‌నగర్ అడిషనల్ కలెక్టర్ బుధవారం పరిశీలించారు. లాలుకోట, చిన్న చింతకుంట గ్రామాల్లో మహిళా ఫెడరేషన్ భవనాల నిర్మాణ పనులు, నెల్లికొండి గ్రామంలో ఫీడర్ చానల్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిబంధనలు పాటించకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

**వేద న్యూస్,కారేపల్లి:**



కారేపల్లి మండలంలోని చంద్రాల గూడెం గ్రామం భక్తితత్పరతతో పులకించిపోయింది. గ్రామస్తుల దశాబ్దాల కల సాకారమవుతున్న వేళ, శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి అత్యంత వైభవంగా, వేద మంత్రోచ్చారణల మధ్య శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ముఖ్య అతిథుల చేతుల మీదుగా భూమి పూజ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బదవత్ వీరన్న హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణానికి పునాది రాయి వేశారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ భూమి పూజలో పలువురు ప్రముఖులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అజ్మీరా సుభాష్,భూక్యా వీరన్న,అజ్మీరా కోటేష్, సర్పంచ్ రాందాస్,మల్కం నాగేశ్వరరావు,అజ్మీరా జోగియా, గ్రామ ఐక్యతకు ప్రతీకగా ఆలయం ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రాలగూడెంలో అభయాంజనేయ స్వామి ఆలయం నిర్మించడం శుభపరిణామమని కొనియాడారు.

# బచ్చోడులో ఆధ్యాత్మిక వైభవం

**- శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠాపన**
**-కన్నులపండువగా శివ-కేశవుల ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం**
**-వేద మంత్రోచ్ఛారణల మధ్య శిఖర కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



తిరుమలాయపాలెం మండల పరిధిలోని బచ్చోడు గ్రామం బుధవారం ఆధ్యాత్మిక చైతన్యంతో పులకించి పోయింది. గత మూడు రోజులుగా అత్యంత నిష్ఠతో నిర్వహిస్తున్న శ్రీ సీతాసమేత శ్రీరామ చంద్ర మూర్తి, లక్ష్మణ, ఆంజనేయ స్వామివార్ల సహిత శ్రీరామ లింగేశ్వర, కనకదుర్గమ్మ ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం నాటి ప్రధాన ఘట్టంతో వైభవంగా ముగిశాయి. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఈ ఆలయ సముదాయంలో విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కోసం సోమవారం నుంచే వేద పండితులు శాస్త్రోక్తంగా జలధివాసం, ధాన్యధివాసం వంటి క్రతువులను నిర్వహించారు.

**సుముహూర్తాన ప్రాణ ప్రతిష్ఠ**

అత్యంత కీలకమైన చివరి రోజైన బుధవారం తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణంలో హోమగుండాల నుంచి వెలువడిన వేద మంత్రోచ్ఛారణలు మారుమోగాయి. ఉదయం 6:30 గంటలకు వాస్తు పూజ, పంచలోహ నవరత్న స్థాపన, జీవం పోయుట వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. అనంతరం ఉదయం 9:50 గంటల సుముహూర్తాన విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఘట్టాలను కన్నులపండువగా నిర్వహించారు. మంగళవాయిద్యాల మధ్య స్వామివార్ల విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ కావించడంతో భక్తుల జయజయధ్వానాలతో బచ్చోడు పులకించింది. ఈ కార్యక్రమంలో రామసహాయం నరేష్ రెడ్డి, రామసహాయం అరవింద్ రెడ్డి, హరిత రెడ్డి, బెల్లం శ్రీను, గంద్ర గోపాలరావు, కొప్పుల అశోక్, మంగీలాల్, ఉన్నం రాజశేఖర్, ఎన్.లింగయ్య, బి.సుదర్శన్, కరీం, వనవాసం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాపర్ వైర్ దొంగల అరెస్ట్

**- ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు**

**వేద న్యూస్, గంగాధర:**



గంగాధర క్రాస్ రోడ్ వద్ద పోలీసులు కాపర్ వైర్ దొంగలను అరెస్ట్ చేశారు. బుధవారం ఉదయం ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న సంచులను పరిశీలించగా కాపర్ వైర్ లభించింది. విచారణలో యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన గోగుల కృష్ణ, బూరుగుపల్లికి చెందిన మానుపాటి హరీశ్ అని గుర్తించారు. మద్యం అలవాటు కారణంగా సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడినట్లు వారు ఒప్పుకున్నారు. గత ఏడాది కాలంగా కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లోని పలు గ్రామాల శివార్లలో ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని రాత్రివేళల్లో చోరీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడైంది. మొత్తం ఆరు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైర్ దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా గంగాధర మండలం పోతుగంటిపల్లి గ్రామంలో ఒక ఇంటిలో చోరీ చేసి రూ.8 వేల నగదు అపహరించినట్లు బయటపడింది. దొంగిలించిన కాపర్ వైర్‌ను అమ్మేందుకు వెళ్తుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 15 కిలోల కాపర్ వైర్, రూ.2 వేల నగదు, దొంగతనానికి ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. మరిన్ని కేసులపై దర్యాప్తు కొనసాగుతోంది.

# ప్రాథమిక పాఠశాలలో అన్యువల్ డే

**- విద్యార్థులకు ఉచిత షూ పంపిణీ**

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ ప్రాథమిక పాఠశాలలో అన్యువల్ డే, వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విలాసాగర్ సర్పంచ్ ఎనుగుల కనుకయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఉచితంగా షూలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పిల్లలు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఐదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. విద్యార్థులు ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొత్తూరి శైలజ, వార్డ్ సభ్యుడు జోగు శంకర్, ప్రధానోపాధ్యాయులు మల్లేశం, బోలగం శ్రీనివాస్, అంగన్వాడి టీచర్ శైలజ, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నూతన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నయీంకి స్వాగతం

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా నర్సింగ్ కళాశాలలో నూతనంగా నియమితులైన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నయీంకి స్వాగతం పలికారు. టీఎన్జీవో ఆర్గనైజింగ్ సెక్రెటరీ మహమ్మద్ అజీజ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెడికల్ ఎంప్లాయీస్ సంఘం జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ జనార్ధన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ అయూబ్ ఖాన్, రబియా, కమరుద్దీన్, తిరుపతి నాయక్, వైస్ ప్రిన్సిపల్ తదితరులు పాల్గొని నయీంకి అభినందనలు తెలిపారు

# రైతుల ఆదాయం పెంచడం లక్ష్యంగా చర్యలు

**- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**వేదన్యూస్, ఖమ్మం ప్రతినిధి :**



రైతుల ఆదాయం పెంచడం లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం నిర్వహించిన జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ 128వ మహాజన సభ సమావేశంలో పిఐసి అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. పిఐసి అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా అందించే వివిధ రకాల రుణాలను వినియోగిస్తూ రైతులు ఎలా ఆర్థికంగా మంచి స్థితికి చేరుకోవచ్చు అనే అంశంపై అవగాహన కల్పించడం కీలకమని తెలిపారు. సాగు యాంత్రీకరణకు రుణాల పంపిణీ పెంచాలని, దీనివల్ల అధిక సంఖ్యలో పంట పండి రైతులకు లాభం చేకూరుతుందని కలెక్టర్ అన్నారు. రైతులకు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం, చేపల పెంపకం వంటి వివిధ వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా ఆదాయం సంపాదించుకోవడంపై సహకార సంఘాలు ప్రోత్సహించాలని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో రైతులకు సంబంధించి వివరాల నమోదులో పొరపాట్లు జరగడం వల్ల రైతులకు నష్టం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ తెలిపారు. సహకార సంఘాలలో రైతుల వివరాలు నమోదు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. రైతుల వివరాల నమోదులో జరిగిన పొరపాట్లను 15 రోజులలో సవరించాలని లేని పక్షంలో చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు మంజూరు చేసిన రుణాల రికవరీ పై వ్యవసాయ సహకార సంఘాలు దృష్టి సారించాలని, రైతులు స్వచ్ఛందంగా రుణాల చెల్లింపులు చేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు ఉత్పత్తులు తయారు చేసే స్థాయికి చేరుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ అన్నారు. రైతులు బలోపేతం కావడం వల్ల మన సహకార సంఘాలు బలోపేతం అవుతాయని, లాభసాటిగా వ్యవసాయం మారుతుందని అన్నారు. అంతకుముందు కలెక్టర్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డిసెంబర్, 2025క్వార్టర్ అంతానికి సాధించిన ప్రగతి, వివిధ అంశాలలో బ్యాంక్ పురోగతి పై అధికారులతో సమీక్షించారు. పిఏసిఎస్ ల బలోపేతం, రైతుల సంక్షేమం దిశగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం ఎల్. సుజిత్ కుమార్, టీఎస్ సిఏబి డిజిఎం కె. రవికాంత్ రెడ్డి, జిల్లా సహకార అధికారి జి. గంగాధర్, ఖమ్మం డిసిసిబి సిఇఓ వెంకట ఆదిత్య, భద్రాద్రి కొత్తగూడెం డిసిసిబి సిఇఓ శ్రీనివాస్, పిఏసీఎస్ అధ్యక్షులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హరిత సంకల్పం 'నర్సరీ' పనులు ముమ్మరం..

**వేద న్యూస్,కారేపల్లి:**



కారేపల్లి మండలం గిద్దవారి గూడెం గ్రామపంచాయతీ ఇప్పుడు పచ్చదనానికి పట్టుగొమ్మలా మారబోతోంది. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి,ఆహ్లాదకరమైన వాతావరణం అందించడమే లక్ష్యంగా, గ్రామ సర్పంచ్ ఈసాల వెంకటేశ్వర్లు, ఆధ్వర్యంలో గ్రామంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే బుధవారం నాడు గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీలో మొక్కల పెంపకానికి సంబంధించి కీలకమైన పనికి శ్రీకారం చుట్టారు. సర్పంచ్ వెంకటేశ్వర్లు ప్రత్యక్ష పర్యవేక్షణలో, గ్రామ సిబ్బంది మరియు ఉపాధి హామీ కూలీలతో కలిసి నర్సరీ 'ప్యాకెట్లలో మట్టి నింపి, మొక్కలు నాటే ప్రక్రియను ఉత్సాహంగా చేపట్టారు. వేలాది మొక్కలను సిద్ధం చేసి, రాబోయే వర్షాకాలం నాటికి గ్రామంలోని ఖాళీ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా నాటడానికి ప్రణాళికలు రూపొందించారు. ఆదర్శంగా నిలుస్తున్న సర్పంచ్ చొరవ గ్రామాన్ని 'హరిత గిద్దవారి గూడెం'గా మార్చాలనే సర్పంచ్ ఈసాల వెంకటేశ్వర్లు తపన, శ్రమ పట్ల గ్రామస్తుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. కేవలం మొక్కలు నాటడమే కాదు, వాటిని సంరక్షించి, అవి పెద్దవి అయ్యేలా చూసేందుకు సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఈసాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ "మన ఊరు, మన ఆరోగ్యం. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి, దానిని కాపాడాల్సిన బాధ్యత ఉంది. మన పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి స్వచ్ఛమైన గాలి. అందుకే పంచాయతీ నర్సరీ ద్వారా నాణ్యమైన మొక్కలను సిద్ధం చేస్తున్నాము. గ్రామస్తులందరూ ఈ హరిత యజ్ఞంలో భాగస్వాములు కావాలన్నారు

# అర్ధరాత్రి అరెస్టులు అప్రజాస్వామికం

**- ఏఐఎస్ఎఫ్ రాజన్న జిల్లా కార్యదర్శి అనిల్ కుమార్**




**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఇచ్చిన 'ఛలో అసెంబ్లీ' పిలుపు నేపథ్యంలో జిల్లా నాయకులను అర్ధరాత్రి సమయంలో ముందస్తుగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామిక చర్య అని ఏఐఎస్ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్ విమర్శించారు. బుధవారం ఉదయం సుమారు 4 గంటల సమయంలో జిల్లా నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి 30 శాతం బడ్జెట్ కేటాయించాలని, సంక్షేమ హాస్టళ్లకు సరైన సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, విద్యాశాఖకు పూర్తి స్థాయి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థి సమస్యలపై ఉద్యమం చేపట్టినందుకు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే విద్యార్థులను ఏకం చేసి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ముందస్తు అరెస్టుల్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు పెండెల ఆదిత్య, బండారి చందు గౌడ్, ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు దొమ్మరి శ్రీహరి తదితరులు ఉన్నారు.

# పెట్రోల్, డీజిల్ పరేషాన్..!

**- పెట్రోల్ బంక్ ల వద్ద బారులు తీరిన వాహనదారులు..**

**వేద న్యూస్, రుద్రూర్ :**




పశ్చిమాసియా దేశాల్లో జరుగుతున్న యుద్ధం కారణంగా జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత నెలకొందంటూ పుకార్లు షికార్లు చేయడంతో ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రుద్రూర్ మండల కేంద్రంలోని పెట్రోల్ బంకుల్లో వాహనదారులు బారులు తీరారు. ఓ వైపు వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత లేదంటు జిల్లా అధికారులు పెట్రోల్ బంక్ నిర్వహకులు స్పష్టం చేస్తున్నప్పటికీ ప్రజలు మాత్రం భయాందోళనతో గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకులకు పరుగులు తీస్తున్నారు. దీంతో ఖాళీ సిలిండర్లతో ఏజెన్సీల వద్ద వాహనాలతో పెట్రోల్ బంకుల వద్ద రాత్రి పగలు అనే తేడా లేకుండా గంటల తరబడి బారులు తీరి కనబడుతున్నారు. అటు అధికారులు ఎలాంటి కొరత లేదంటు ప్రకటనలు చేస్తుంటే మరి ఏజెన్సీలు, పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ అని బోర్డులు ఎందుకు పెడుతున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా అధికారుల ప్రకటనలు ప్రజల్లో నెలకొన్న అపోహలతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

వేద న్యూస్

గురువారం మార్చి 26, 2026

# ఇండ్లు ఖాళీ చేయమంటున్నారు.. మేమెక్కడికి వెళ్లాలి?

## - డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుపై బాధితుల ఆవేదన



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మండలం ధర్మారం గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను కొంతమంది స్థానికులు ఆక్రమించి నివాసం ఉంటుండగా, అధికారులు వాటిని ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. సొంత ఇల్లు, భూమి లేని తాము ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు స్పందించలేదని, అర్హత ఉన్నప్పటికీ ఇళ్లు కేటాయించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. కిరాయిలు భరించలేక నిరుపయోగంగా ఉన్న ఇళ్లలోకి వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. అధికారులు ఇళ్లను ఖాళీ చేయమంటున్న నేపథ్యంలో తాము ఎక్కడికి వెళ్లాలనే ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మించిన ఇళ్లను పంపిణీ చేయకుండా ఖాళీగా ఉంచడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థలం లేని నిరుపేదలకు ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని, వెంటనే సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని బాధితులు కోరుతున్నారు.

# గురుకుల ప్రవేశ పరీక్షలో శ్రీవిద్య పాఠశాల విద్యార్థుల ప్రభంజనం

## - 14మంది విద్యార్థుల ఎంపిక

**వేద న్యూస్, పాపన్నపేట :**

తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్షలో శ్రీ విద్య పాఠశాల విద్యార్థులు విజయ ఢంకా మోగించారు. పాఠశాల నుండి 15మంది విద్యార్థిని విద్యార్థులు ఫిబ్రవరి 22న ప్రవేశ పరీక్షలకు హాజరు కాగా రాష్ట్ర ప్రభుత్వ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష రిజల్ట్స్ మంగళవారం సాయంత్రం ప్రకటించడంతో శ్రీ విద్య పాఠశాల నుండి మొదటి విడత జాబితాలో 14మంది విద్యార్థిని విద్యార్థులు 5వ తరగతి ప్రవేశ కు అర్హత సాధించారు. కాగా పాఠశాల నుండి 15మంది విద్యార్థిని విద్యార్థులు ప్రవేశ పరీక్షలో పాల్గొని పరీక్ష వ్రాయగా 14మంది విద్యార్థులు ర్యాంకు సాధించడం కోసం కృషి చేసిన ఉపాధ్యాయులు దుర్గ. సునీత. అనురాధ. షీలా. విలాస్. జ్యోతిరాజ్ ప్రధాన్ లు పాఠశాల యాజమాన్యం,ప్రిన్సిపాల్ రవీందర్ గుప్తా .,కరస్పాండెంట్ లు నిటలాక్షప్ప. సుమన్, లు అభినందించారు. ప్రతి ఏటా తెలంగాణ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష లలో ఇలాంటి ఫలితాలు పునరావృతం కావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.




# 10 నెలల పసికందుకు అరుదైన శాస్త్ర చికిత్స

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం ప్రాంతానికి చెందిన 10 నెలల బాబు ఎముక మజ్జ వైఫల్యంతో బాధపడుతున్న తరుణంలో ఆ బాబు తల్లిదండ్రులు హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్ ను సంప్రదించంగా అక్కడ వైద్య బృందం అరుదైన శాస్త్ర చికిత్స అందించి అత్యాధునిక హాప్లోయిడెంటికల్ స్టెమ్ సెల్ మార్పిడి చేసి కొత్త జీవితాన్ని అందించారని ఖమ్మం యశోద మెడికల్ సెంటర్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ విక్రమ్ కుమార్ వెల్లడించారు. ఇది వారసత్వంగా వచ్చే అమెగాకార్యోసైటిక్ థ్రోంబోసైటోపెనియా అనే అరుదైన ఎముక మజ్జ వ్యాధి . గతేడాది డిసెంబర్ 26న సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తీసుకొచ్చారు . సమగ్ర క్లినికల్ పరీక్షల అనంతరం అమె గాకార్యోసైటిక్ థ్రోంబోసైటోపెనియా ఉన్నట్లు, ప్లేట్లెట్స్ కౌంట్ తక్కువగా ఉండటాన్ని గుర్తించారు . శస్త్రచికిత్స పూర్తిచేసుకున్న చిన్నారితో వైద్య బృందం నిర్ధారణ అయిందని ఇది తీవ్రమైన థ్రోంబోసైటోపె నియా, రక్తస్రావం, ప్రమాదంతో కూడిన అరుదైన వారసత్వంగా వచ్చే ఎముక మజ్జ వైఫల్య రుగ్మతగా గుర్తించి తండ్రి మూల




కణాలను ఉపయోగించి హాప్లోయిడెంటికల్ స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంటేషన్ జనవరి 8న విజయవంతంగా నిర్వహించారు . బాబు వైద్యపరంగా స్థిరంగా ఉన్నాడని నిర్ధారించుకున్న తరువాత డిశ్చార్జ్ చేశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ రావు, బాలకృష్ణ , నాగార్జున పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం

## - పటాన్చెరు శాసనసభ్యులు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి

**వేద న్యూస్, పటాన్ చెరువు:**



పల్లె నుండి పట్నం వరకు నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, అవసరమైన పక్షంలో ఉద్యమాలకు సైతం సిద్ధమని పటాన్చెరు శాసన సభ్యులు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన రేషన్ డీలర్ల సంఘం సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సంభవించిన, కరోనా లాంటి మహమ్మారి మూలంగా లక్షలాదిమంది చనిపోయిన సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందించడంలో రేషన్ డీలర్ల పాత్ర శ్లాఘనీయమన్నారు. దశాబ్ద కాలంగా రేషన్ డీలర్లు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు ఇచ్చిన ప్రధాన హామీలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో పాటు, ప్రతి రేషన్ డీలర్ కు 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్, ఎంఎల్ఎస్ పాయింటలో ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలు, కరోనా సమయంలో మరణించిన రేషన్ డీలర్ల కుటుంబ సభ్యులకు తిరిగి రేషన్ దుకాణాలు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# రెచ్చిపోయిన దొంగలు

## - తాళం వేసిన రెండిళ్లలో చోరీ
## - పోలీసుల దర్యాప్తు ప్రారంభం



**వేద న్యూస్, చొప్పదండి:**

మండలంలోని రేవెల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో చోరీలు చోటుచేసుకున్నాయి. ఇరుగురాళ్ల సరీన్ కుమార్ నాలుగు రోజుల క్రితం మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు బంధువుల ఇంటికి వెళ్లి ఇంటికి తాళం వేసి వెళ్లగా, తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టినట్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంట్లో అర తులం బంగారం దొంగిలించినట్లు తెలిపారు. అలాగే పక్కనే ఉన్న రేకుల లక్ష్మారెడ్డి ఇంట్లో కూడా చోరీ జరిగినట్లు తెలిసింది. ఆయన ఖమ్మం జిల్లాలో ఉన్న తన కుమార్తె వద్ద ఉండడంతో, పోయిన వస్తువుల విలువ ఇంకా తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్ టీంతో కలిసి ఫింగర్‌ప్రింట్లు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నాగరాజుపల్లిలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**వేద న్యూస్, నల్లబెల్లి:**



నల్లబెల్లి మండలం నాగరాజుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి చొరవతో విజీఎస్ నిధుల ద్వారా చేపడుతున్న ఈ పనులకు సర్పంచ్ ఎరుకల లలిత కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ లలిత మాట్లాడుతూ, గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల సౌకర్యార్థం మరిన్ని పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, నాయకులు వైనాల అశోక్, శేఖర్ గౌడ్, భూక్య భాసింగ్, పబ్బు రాజేష్, బైరి వెంకటేశ్వర్లు, వల్లె పైడి, బైరి అశోక్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గాంధారిపల్లిలో అక్రమ ఇసుక నిల్వలు సీజ్

**వేద న్యూస్,పాపన్నపేట :**



మండల కేంద్రమైన గాంధారిపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 30 ట్రాక్టర్ల ఇసుకను బుధవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆర్ఐ సత్తు స్వామి, మంజుల క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి 3 ఇసుక కుప్పలను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు అతిక్రమించి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# నాలుగేళ్లుగా జీతం లేకున్నా..

## - సేవాయోధుడు కోటేశ్వర్..
## - వేతనం విడుదల చేయాలని గ్రామస్తుల డిమాండ్



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండలంలోని 29 గ్రామాలకు తాగునీటి సరఫరా బాధ్యతలు నిర్వర్తిస్తున్న చేతి పంపు మెకానిక్ బూర కోటేశ్వర్ (కోటి) నాలుగేళ్లుగా జీతం లేకుండానే సేవలు అందిస్తూ సేవాభావానికి నిదర్శనంగా నిలుస్తున్నారు. 2004 నుంచి ఎంపీడీవో కార్యాలయంలో బోరింగ్ మెకానిక్‌గా పని చేస్తున్న కోటి నెలకు రూ.14,720 వేతనం పొందేవారు. అయితే 2022 జూలై నుంచి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా అందకపోవడం స్థానికుల్లో ఆగ్రహాన్ని కలిగిస్తోంది. ఏ గ్రామంలో పంపు చెడినా వెంటనే చేరుకుని మరమ్మతులు చేసి నీటి సమస్యలు లేకుండా చూసే ఆయన సేవలు కొనసాగుతూనే ఉన్నాయి. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేస్తున్నారు.

# ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు కోల్పోయి..

**వేద న్యూస్ బెంగళూరు :**



ఒక ఎంబీబీఎస్ విద్యార్థి ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు కోల్పో యాడు. దీంతో మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలో మెడికల్ కాలేజీ హాస్టల్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కర్ణాటక లో ఈ సంఘటన జరిగింది. కాలబురగికి చెందిన 21 ఏళ్ల అనిష్కర్ చౌహాన్, బీదర్‌లోని మెడికల్ కాలేజీలో చదువుతున్నాడు. ఎంబీబీఎస్ చివరి ఏడాది విద్యార్థి అయిన అతడు ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిస అయ్యాడు. స్నేహితుల వద్ద సుమారు రూ.80,000 అప్పులు చేశాడు. ఆన్‌లైన్ గేట్‌లో ఈ డబ్బు పోగొట్టుకున్నాడు.

వేద న్యూస్

గురువారం మార్చి 26, 2026

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అరూరి


**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



వంగాలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు కొంగ రాజు తండ్రి కొంగ గణేష్ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆ కుటుంబాన్ని వర్ధన్నపేట మాజీ శాసనసభ్యుడు ఆరూరి రమేష్, మాజీ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి బుధవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పిన వారు కుటుంబానికి రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం కొంగ గణేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా యువ నాయకుడు కేసిరెడ్డి రాకేష్ రెడ్డి, నియోజకవర్గ యువ విభాగం ప్రధాన కార్యదర్శి అనంతపురం కమలేష్, మాజీ సర్పంచులు మునిగాల యాకుబ్, కలకోటి అనిల్, వార్డ్ సభ్యులు మట్టపల్లి వెంకటేశ్వర్లు, పాశం సంజీవ, కలకోల్ యాదగిరి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సంస్కరణలు భవనాలు వర్సెస్ నాణ్యత

### బడ్జెట్ నిధులు, వసతుల కల్పన, బోధనా ప్రమాణాలు




**వేద న్యూస్ డెస్క్:**

తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ సమూల మార్పులకు లోనవుతున్న తరుణంలో, ప్రభుత్వం కేటాయిస్తున్న బడ్జెట్ మరియు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల మధ్య సమతుల్యతపై విస్తృత చర్చ జరుగుతోంది. ముఖ్యంగా విద్యా రంగానికి వేల కోట్ల రూపాయలు కేటాయించడం శుభపరిణామం అయినప్పటికీ, ఆ నిధులు కేవలం భవనాల నిర్మాణానికే పరిమితం అవుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ సంస్థలకు ధీటుగా కనిపిస్తున్న మాట వాస్తవమే కానీ, ఆ గోడల మధ్య జరిగే బోధనలో నాణ్యత ఎంతవరకు ఉందనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. విద్యా సంస్కరణలు అంటే కేవలం రంగులద్దిన గోడలు, ఆధునిక బెంచీలు మాత్రమే కాదు, విద్యార్థి మేధస్సును పదునుపెట్టే ఉత్తమ విద్యా విధానం కూడా అందులో భాగం కావాలి. రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్' ద్వారా ప్రభుత్వం ఒక కొత్త ఒరవడిని సృష్టించాలని చూస్తోంది.

అంతర్జాతీయ స్థాయి వసతులతో కూడిన ఈ పాఠశాలలు పేద విద్యార్థులకు వరంలా మారతాయని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, ఈ భారీ భవనాల నిర్వహణ మరియు భవిష్యత్తులో వీటిని కొనసాగించే విధంపై స్పష్టమైన ప్రణాళిక అవసరం. గతంలో కూడా అనేక భవనాలు నిర్మించినా, సరైన నిర్వహణ లేక అవి శిథిలావస్థకు చేరుకున్న దాఖలాలు ఉన్నాయి. కాబట్టి, కొత్తగా నిర్మించే ప్రతి ఇటుక వెనుక నాణ్యమైన విద్యను అందించాలనే బలమైన సంకల్పం ఉంటేనే ఈ వేల కోట్ల రూపాయల పెట్టుబడికి సార్థకత లభిస్తుంది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పన అనేది ప్రాథమిక అవసరం. తాగునీరు, శుభ్రమైన మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం వంటి కనీస వసతులు లేని పాఠశాలల్లో విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టడం అసాధ్యం. ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేయడం మంచిదే అయినా, డిజిటల్ తరగతి గదులు మరియు కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటులో మరింత వేగం పెంచాల్సి ఉంది.

ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం లేని విద్య అసంపూర్ణం కాబట్టి, ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి ఇంటర్నెట్ మరియు కంప్యూటర్ సౌకర్యం అందుబాటులోకి రావాలి. వసతుల కల్పన అనేది నిరంతర ప్రక్రియగా సాగాలి తప్ప కేవలం ఎన్నికల హామీలకో, బడ్జెట్ ప్రసంగాలకో పరిమితం కాకూడదు. బోధనా నాణ్యత విషయంలో ప్రభుత్వం కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అత్యాధునిక భవనాలు ఉన్నప్పటికీ, అక్కడ పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేకపోతే ఆ భవనాలు నిరుపయోగం. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలి.

కేవలం నియామకాలు మాత్రమే సరిపోవు, మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులకు నిరంతరం శిక్షణ ఇవ్వాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక అంశాలను విద్యార్థులకు బోధించాలంటే, ముందుగా ఉపాధ్యాయులు వాటిపై పట్టు సాధించాలి. విద్యా నాణ్యత అనేది కేవలం సిలబస్ పూర్తి చేయడంలో లేదు, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడంలో ఉంది. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఒక సాహసోపేతమైన నిర్ణయం. కౌమార దశలో ఉన్న విద్యార్థులకు సరైన పోషకాహారం అందడం వల్ల వారు చదువులో రాణించే అవకాశం ఉంటుంది. కానీ, ఈ పథకం అమలులో క్షేత్రస్థాయిలో అనేక లోపాలు కనిపిస్తున్నాయి.

నిధుల విడుదల ఆలస్యం కావడం వల్ల నిర్వాహకులు నాణ్యత లేని భోజనాన్ని వడ్డిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపే ఇటువంటి అంశాల్లో ప్రభుత్వం ఏమాత్రం అలసత్వం వహించకూడదు. భోజన నాణ్యతను తనిఖీ చేయడానికి ప్రతి కళాశాలలో ఒక పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా ఈ సమస్యను కొంతవరకు అధిగమించవచ్చు. విద్యా వ్యవస్థలో నాణ్యత పెరగాలంటే పాఠ్యాంశాల రూపకల్పనలో కూడా మార్పులు రావాలి. ప్రస్తుతం ఉన్న సిలబస్ కేవలం మార్కుల వేటకే ప్రాధాన్యత ఇస్తోంది తప్ప, విద్యార్థికి కావలసిన జీవన నైపుణ్యాలను నేర్పించడం లేదు. ప్రాథమిక స్థాయి నుండి వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టడం ద్వారా చదువు పూర్తి చేసిన వెంటనే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఆంగ్ల భాషా నైపుణ్యాలతో పాటు మాతృభాషపై మమకారం పెంచేలా విద్యా విధానం ఉండాలి. విద్య అనేది కేవలం పుస్తకాలకు పరిమితం కాకుండా, సమాజాన్ని అర్థం చేసుకునేలా ఉండాలి.

అప్పుడే విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారు మరియు సమాజ అభివృద్ధిలో భాగస్వాములవుతారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణం ప్రైవేట్ పాఠశాలలపై ప్రజల్లో ఉన్న మితిమీరిన నమ్మకం. ఈ ధోరణిని మార్చాలంటే ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఉన్నత అధికారులు మరియు ప్రజాప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినప్పుడే సామాన్యులకు కూడా ఆ నమ్మకం కలుగుతుంది. విద్యా రంగంలో సంస్కరణలు అనేవి కేవలం కాగితాల మీద కాకుండా, సామాన్య విద్యార్థికి అందే ఫలాల ద్వారా కొలవబడాలి.

## ఫెయిత్ హోమ్ చర్చి సొసైటీదే

### – ఫేత్ హోం చర్చ్ అధ్యక్షులు బండి రాజ్ కుమార్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**




వడ్డేపల్లి ఫేత్ హోం చర్చ్ మినిస్ట్రీస్ చెందిన ఆస్తులని సొసైటీకి సంబంధించినవే అని.. ఆ ఆస్తులను కొందరు వ్యక్తులు కుట్రలు చేసి అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని ఫెయిత్ హోం అధ్యక్షులు బండి రాజకుమార్ తెలిపారు. కాజీపేట మీడియా పాయింట్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. సర్వేనెంబర్ 149జూ, 387, లో 484 గజాల స్థలంలో చర్చిని నిర్మించామని పేర్కొన్నారు. చర్చిలో పనిచేసే పాస్టర్ మిట్టపల్లి రాజమౌళి పాస్టర్ గా ఉంటూ అనారోగ్యంతో మరణించారు. తదనంతరం బండి రాజకుమార్ పాస్టర్‌గా ఉంటూ చర్చిని నడిపిం చామన్నారు. అలాగే సంవత్సరం కాలం నుంచి కాజీపేట సబ్ బ్రాంచ్ కూడా నడిపిస్తూ వస్తున్నామన్నారు. చర్చిని నడిపించే క్రమంలో ఈ మధ్యకాలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కుమ్మక్కై చర్చి స్థలాన్ని అమ్మేందుకు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ చర్చిని ఎవరు కొనుగోలు చేయొద్దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఎన్ ఆశీర్వాదం, సీమోను, సమ్మయ్య పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళన సమితి అధ్యక్షుడిగా కందికొండ మోహన్

### – ప్రధాన కార్యదర్శిగా శ్రీరామ్ మనోజ్ కుమార్ ఏకగ్రీవం

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



హిందూ సమ్మేళన సమితి అధ్యక్షులు కందికొండ మోహన్



హిందూ సమ్మేళన సమితి ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ మనోజ్ కుమార్

హిందూ బంధువులందరినీ ఏకం చేస్తూ రంగశాయిపేట మహంకాళీ దేవాలయ ప్రాంగణంలో ఏప్రిల్ నెలలో నిర్వహించే హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయటం కొసం ఏర్పాటు చేసిన రంగశాయిపేట, శంభునిపేట బస్తీ ప్రాంతాల హిందూ సమ్మేళన సమితి అధ్యక్షుడిగా కందికొండ మోహన్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరామ్ మనోజ్ కుమార్లను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం రంగశాయిపేట మహంకాళీ ప్రాంగణం వద్దగల కమ్యూనిటీ భవనంలో శంభునిపేట, రంగశాయిపేట ప్రాంతాల్లోని పలు కాలనీల వాసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో హిందూ సమ్మేళన సమితి అధ్యక్ష కార్యదర్శులుగా కందికొండ మోహన్, శ్రీరామ్ మనోజ్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కందికొండ మెహన్ మాట్లాడుతూ ఈ హిందూ సమ్మేళనం అనేది హిందూ సమాజ ఐక్యత, సనాతన ధర్మ పరిరక్షణ, మరియు ఆధ్యాత్మిక విలువలను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించబడే ఒక ముఖ్యమైన సామాజిక-ధార్మిక కార్యక్రమమని, హిందువులను ఏక తాటిపైకి తీసుకురావడానికి, ప్రత్యేకించి యువతలో సాంస్కృతిక జాగృతిని కలిగించడానికి ఈ సమ్మేళనాలను ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. హిందూ సమ్మేళనం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలు వివిధ వర్గాల హిందువులను కులమత భేదాలు లేకుండా ఐక్యం చేయడం, సనాతన ధర్మం, ఆధ్యాత్మిక విలువలు మరియు సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందించడం, హైందవ సమాజాన్ని జాగృతం చేయడం మరియు సామాజిక బలహీనతలను అధిగమించడమే అని తెలిపారు. ఈ సమ్మేళనంలో యజ్ఞాలు, భజన సంకీర్తనలు, మరియు ఆధ్యాత్మిక ప్రవచనాలను నిర్వహించడం జరుగుతుందని, ఈ సమ్మేళనాలు హిందూ సమాజంలో ఆత్మవిశ్వాసాన్ని మరియు ధర్మం పట్ల నిబద్ధతను పెంపొందించే వేదికలుగా పనిచేస్తాయని తెలిపారు హిందూ సమ్మేళన కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలు, ప్రవచనకర్తలు హాజరుకానున్నట్లు, ఈ హిందూ సమ్మేళన కార్యక్రమంలో రంగశాయిపేట, శంభునిపేట ప్రాంతాల హిందూ ప్రజలు పాల్గొని కార్యక్రమ్మన్ని విజయవంతం చేయవలసిందిగా అధ్యక్ష, కార్యదర్శులు కందికొండ మోహన్, శ్రీ రామ్ మనోజ్ కుమార్ కోరారు. ఏప్రిల్ మాసంలో నిర్వహించే ఈ కార్యక్రమ తేదీనీ, సమయాన్ని, హాజరయ్యే ప్రముఖుల వివరాలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంభునిపేట రంగశాయిపేట ప్రాంతాల హిందువులు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## సుల్తానాబాద్‌లో ఆయిల్ పామ్ విస్తరణపై కలెక్టర్ పర్యటన

**వేద న్యూస్ పెద్దపల్లి :**



జిల్లాలో ఆయిల్ పామ్ పంట విస్తరణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. బుధవారం సుల్తానాబాద్ మండలం బొంతకుంటపల్లి గ్రామంలో పర్యటించిన ఆయన, ఆయిల్ పామ్ తోటలతో పాటు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామంలో 30 ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్ పామ్, 4 ఎకరాల్లో సాగు చేస్తున్న కోకో పంటలను కలెక్టర్ పరిశీలించారు. ఆయిల్ పామ్ తోటల్లో కోకో అంతర్ పంటగా సాగు చేయవచ్చని తెలిపారు. మండలంలో ప్రస్తుతం 350 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని వివరించారు. రాబోయే జూన్ నుంచి కొన్ని ప్రాంతాల్లో ఆయిల్ పామ్ కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. పంట ద్వారా రైతులకు వచ్చే ఆదాయం గురించి విస్తృతంగా ప్రచారం చేసి మరింత విస్తరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నరేగా పథకం కింద గడ్డి తొలగింపు పనులు చేపడితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు తెలియజేయగా, దీనిపై పరిశీలించాలని అధికారులకు సూచించారు. అధికారులు, కంపెనీ ప్రతినిధుల ద్వారా రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందుతున్నాయని రైతులు తెలిపారు. పంట పురోగతిపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతుల ఆదాయం పెరగడం సాధ్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని కూడా కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం నిధులు రెగ్యులర్‌గా విడుదల చేస్తున్నదని తెలిపారు. బొంతకుంటపల్లి గ్రామానికి చెందిన ఒక లబ్ధిదారుకు ఇప్పటికే రూ.3.40 లక్షలు విడుదలయ్యాయని, పనులు పూర్తి చేస్తే మిగిలిన నిధులు విడుదల అవుతాయని చెప్పారు. పెండింగ్ పనులను 15 రోజుల్లో పూర్తి చేసి ఫైనల్ బిల్లు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో హార్టికల్చర్ అధికారులు, ఎంపీడీవో, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. రైతులకు మేలు చేసే విధంగా పథకాలు అమలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష పేర్కొన్నారు.

## జాబ్ మేళా పరిశీలించిన కలెక్టర్



**వేద న్యూస్ పెద్దపల్లి :**

నిరుద్యోగ యువత జాబ్ మేళాల ద్వారా లభించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని టాస్క్ సెంటర్‌లో నిర్వహిస్తున్న జాబ్ మేళాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం పలు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. టాస్క్ సెంటర్ ద్వారా వివిధ నైపుణ్య కోర్సుల్లో శిక్షణ అందిస్తూ, మంచి కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. టాస్క్ సెంటర్‌లో నమోదు అయిన ప్రతి నిరుద్యోగికి ఉపాధి లభించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జాబ్ మేళా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ యువతకు మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. నేడు వివిధ కంపెనీల ద్వారా నిర్వహిస్తున్న జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు శిక్షణతో పాటు ఉద్యోగాలు కూడా కల్పించనున్నట్లు ఆయన వివరించారు. ఈ తరహా కార్యక్రమాలను యువత తప్పక వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ సెంటర్ అధికారులు, కౌసల్య సిబ్బంది మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. యువత భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష పిలుపునిచ్చారు.

వేద న్యూస్

గురువారం మార్చి 26, 2026

# ‘రాకాస’ విజువల్ వండర్..






**వేద న్యూస్ డెస్క్:**

జీ స్టూడియోస్ సమర్పణలో, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారిక కొణిదెల, ఉమేష్ కుమార్ బన్సాల్ సంయుక్తంగా నిర్మించిన భారీ చిత్రం ‘రాకాస’ ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే టీజర్, గ్లింప్స్, పాటలతో ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించిన ఈ సినిమా గురించి దర్శకురాలు మానస శర్మ కీలక విషయాలు వెల్లడించారు. ‘రాకాస’ సినిమా ప్రేక్షకులకు పూర్తిగా కొత్త తరహా థియేట్రికల్ అనుభూతిని అందిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటిస్తున్నారు. వీరి నటనతో పాటు కథలోని ఫాంటసీ, అడ్వెంచర్ అంశాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయని దర్శకురాలు తెలిపారు. సినిమా కేవలం కామెడీకి పరిమితం కాకుండా, హారర్, ఫాంటసీ, ఎమోషన్స్శ్రీశ్రీ కలిసి ఒక విభిన్నమైన అనుభూతిని అందించేలా తెరకెక్కించామని చెప్పారు. తన సినీ ప్రయాణం గురించి మాట్లాడిన మానస శర్మ, యూట్యూబ్‌లో సంచలనం సృష్టించిన ‘మ్యాడ్ హౌస్’తో తన కెరీర్ ప్రారంభమైందని, ఆ తర్వాత పలు వెబ్ సిరీస్‌ల ద్వారా అనుభవాన్ని సంపాదించి, ఇప్పుడు ‘రాకాస’లాంటి భారీ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించే స్థాయికి చేరుకున్నానని తెలిపారు. ఈ అనుభవం వల్లే సినిమాను అత్యున్నత నాణ్యతతో తెరకెక్కించగలిగానని చెప్పారు. సినిమా మేకింగ్ పరంగా కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని, ముఖ్యంగా సెకండాఫ్‌లో ఉండే భారీ గ్రాఫిక్స్ సన్నివేశాల కోసం ముందుగానే ప్రణాళిక రూపొందించి, షూటింగ్ మరియు వీఎఫ్ఎక్స్ పనులను సమాంతరంగా పూర్తి చేశామని వివరించారు. దీంతో సమయం ఆదా కావడంతో పాటు, అవుట్‌పుట్ నాణ్యత కూడా మెరుగుపడిందన్నారు. సంగీత దర్శకుడు అనుదీప్ దేవ్ అందించిన సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తాయని, విజువల్స్‌తో కలిసిపోతూ ప్రేక్షకులకు ఒక అందమైన అనుభూతిని అందిస్తాయని పేర్కొన్నారు. నిర్మాత నిహారిక కొణిదెల ఈ ప్రాజెక్ట్‌కు ఇచ్చిన సహకారం మరువలేనిదని, కథ విన్న వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, సినిమా వేగంగా పూర్తయ్యేలా సహకరించారని చెప్పారు. బడ్జెట్‌పై వస్తున్న వార్తల గురించి స్పందిస్తూ, ప్రతి సినిమాలో కొన్ని హెచ్చుతగ్గులు సహజమని, కానీ తాము అనుకున్న పరిమితుల్లోనే అత్యుత్తమ నాణ్యతను అందించామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ప్రేక్షకులను అలరించే వినోదాత్మక కథలతో ముందుకు వస్తానని మానస శర్మ తెలిపారు. మొత్తానికి ‘రాకాస’ చిత్రం విజువల్ వండర్‌గా ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించడమే కాకుండా, కొత్త తరహా కథనం, అద్భుతమైన మేకింగ్‌తో టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు సాధించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# ఒక్క సినిమాతో స్టార్ హీరోయిన్..


## మమితా బైజుకు వరుస భారీ ఆఫర్లు!



**వేద న్యూస్ డెస్క్:**

మమితా బైజు ‘ప్రేమలు’ సినిమా ద్వారా ఒక్కసారిగా దక్షిణాదిలో స్టార్‌డమ్ సంపాదించి, ఇప్పుడు కోలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది. ఒకే ఒక్క సినిమాతోనే టాప్ హీరోల దృష్టిని ఆకర్షించిన ఈ మలయాళ బ్యూటీకి వరుసగా భారీ అవకాశాలు వరుస కడుతున్నాయి. తమిళ చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టిన తక్కువ కాలంలోనే మమితా బైజు, అగ్ర హీరోల సరసన కీలక పాత్రలు దక్కించుకోవడం విశేషం. ముఖ్యంగా విజయ్, సూర్య, ధనుష్ వంటి స్టార్ హీరోల సినిమాల్లో ఆమెకు అవకాశాలు రావడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. దళపతి విజయ్ నటిస్తున్న ‘జననాయకన్’ చిత్రంలో మమితా బైజు ఒక కీలక పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాలో విజయ్ కూతురిగా ఆమె నటిస్తున్నట్లు సమాచారం. స్టార్ హీరో సినిమాలో ఇంతటి ప్రాధాన్యం ఉన్న పాత్ర దక్కడం ఆమె కెరీర్‌కు పెద్ద మైలురాయిగా భావిస్తున్నారు. ఇక సూర్య హీరోగా తెరకెక్కుతున్న ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ చిత్రంలో మమితా సాహసోపేతమైన పాత్రను ఎంచుకుంది. తనకంటే ఎంతో పెద్ద వయస్సు ఉన్న వ్యక్తిని ప్రేమించే యువతిగా ఆమె కనిపించనుండటం ఈ సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ పాత్ర ద్వారా తన నటనలోని వైవిధ్యాన్ని చూపించేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు ధనుష్ సరసన ‘కరలో’ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తూ, పల్లెటూరి అమ్మాయి పాత్రలో సహజ నటనతో ప్రేక్షకులను మెప్పించేందుకు రెడీ అవుతోంది. విభిన్నమైన కథలతో, విభిన్న పాత్రలతో ముందుకు సాగుతున్న మమితా బైజు, తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌ల జాబితాలో చేరేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. మొత్తానికి, ‘ప్రేమలు’ ఇచ్చిన విజయంతో మమితా బైజు కెరీర్ పూర్తిగా మారిపోయిందని చెప్పాలి. సరైన కథలను ఎంచుకుంటూ ముందుకు సాగితే, దక్షిణాది సినీ పరిశ్రమలో ఆమెకు మరింత భారీ స్థానం దక్కడం ఖాయం అని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# చరణ్‌కు స్వల్ప గాయం



**వేద న్యూస్ డెస్క్:**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం నటిస్తున్న పెద్ది సినిమా షూటింగ్ సమయంలో స్వల్ప గాయం కావడంతో అభిమానులు ఆందోళన చెందుతున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ సందర్భంగా చరణ్ కంటి సమీపంలో చిన్నపాటి గాయం తగిలినట్లు సమాచారం. అయితే ఇది పెద్దగా ప్రమాదకరం కాదని, ఆందోళన అవసరం లేదని చిత్రబృందం స్పష్టం చేసింది. ఈ కారణంగా చరణ్ రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకుని, అనంతరం తిరిగి షూటింగ్‌లో పాల్గొననున్నాడు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో కొనసాగుతోంది. ఈ సినిమాను వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తుండగా, హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటిస్తోంది. కీలక పాత్రల్లో శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ నటిస్తున్నారు. సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏ ఆర్ రెహమాన్ అందిస్తున్నారు. ఇక చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి టీజర్ విడుదలయ్యే అవకాశముందని అభిమానులు ఎదురుచూస్తున్నారు. అలాగే ప్రత్యేక గీతంపై కూడా ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. పూజా హెగ్డే, మృణాల్ ఠాకూర్ పేర్లు వినిపిస్తుండగా, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది మొత్తానికి చిన్న గాయమే అయినప్పటికీ, చరణ్ త్వరగా కోలుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# ఇన్‌స్టాగ్రామ్‌లోకి అన్నా కొణిదెల



**వేద న్యూస్ డెస్క్:**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా సోషల్ మీడియాలోకి అడుగుపెట్టి ‘అన్నా కొణిదెల’గా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె ఖాతా ప్రారంభించగానే భారీ స్పందన లభించగా, కొద్ది గంటల్లోనే లక్షల సంఖ్యలో అనుచరులు చేరడం విశేషం. తొలి పోస్టులో తనను పరిచయం చేసుకున్న అన్నా కొణిదెల, రెండో పోస్టులో భర్త పవన్ కళ్యాణ్‌తో కలిసి ఉన్న ఫోటోను పంచుకోవడం అభిమానులను ఆకట్టుకుంది. తన బయోలో “రష్యన్ హార్ట్, ఇండియన్ సోల్” అని పేర్కొంటూ తన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించారు. రష్యాలో జన్మించి, భారతీయ కుటుంబంలో కోడలిగా చేరిన తర్వాత రెండు సంస్కృతుల సమ్మేళనంతో జీవిస్తున్నానని ఆమె వెల్లడించారు. ఇన్‌స్టాగ్రామ్‌లోకి రావాలన్న ఆలోచన చాలా కాలంగా ఉన్నప్పటికీ, ఇప్పుడు సరైన సమయం అనిపించిందని ఆమె తెలిపారు. కుటుంబ సభ్యుల ఆశీస్సులు, ముఖ్యంగా భర్త పవన్ కళ్యాణ్ ప్రోత్సాహంతో ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నానని పేర్కొన్నారు. ప్రేమ, కృతజ్ఞతలతో జీవిస్తూ నిరంతరం నేర్చుకోవడం తన జీవిత విధానమని ఆమె తన పోస్టుల్లో తెలియజేశారు. ఇదిలా ఉండగా, అన్నా కొణిదెల సోషల్ మీడియాలోకి రావడాన్ని పవన్ కళ్యాణ్ స్వాగతిస్తూ ప్రత్యేక సందేశం పంచుకున్నారు. మొత్తానికి, అన్నా కొణిదెల ఇన్‌స్టాగ్రామ్ ఎంట్రీతో మెగా అభిమానులకు ఆమె మరింత దగ్గరయ్యే అవకాశం కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఆమె మరిన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకుంటూ సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు సాధించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తమన్నా అందం రహస్యం..



**వేద న్యూస్ డెస్క్:**

తమన్నా భాటియా తనదైన ఫ్యాషన్ సెన్స్‌తో ఎప్పుడూ ట్రెండ్ సెట్ చేస్తూ ఉండే స్టార్ హీరోయిన్. రెడ్ కార్పెట్ ఈవెంట్స్‌లోనైనా, సాధారణ ప్రయాణాల్లోనైనా ఆమె కనిపించే స్టైల్ చాలా మందికి ఇన్‌స్పిరేషన్‌గా మారుతోంది. తాజాగా సోషల్ మీడియా ద్వారా తన అందం, స్టైల్ వెనుక ఉన్న చిన్న కానీ ప్రభావవంతమైన రహస్యాన్ని అభిమానులతో పంచుకుంది. ఫ్యాషన్ అంటే ఖరీదైన దుస్తులు మాత్రమే కాదని, మనం ఎంచుకునే చిన్న యాక్సెసరీస్ కూడా మొత్తం లుక్‌ను మార్చేస్తాయని తమన్నా చెప్పింది. ముఖ్యంగా ‘టర్కోయిస్’ రంగు ఆభరణాలు ధరించడం ద్వారా సాధారణ లుక్‌కే క్యాజువల్ గ్లామర్ టచ్ వస్తుందని ఆమె వివరించింది. టర్కోయిస్ రంగు ప్రత్యేకత గురించి మాట్లాడుతూ, ఈ రంగు శతాబ్దాలుగా ఆభరణాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని, ఇది ఒకేసారి శక్తివంతంగా, ఆశాజనకంగా, ఆకర్షణీయంగా కనిపిస్తుందని తెలిపింది. ఈ రంగు ఏ చర్మ ఛాయపై అయినా బాగా సెట్ అవ్వడం దీనికున్న మరో పెద్ద ప్లస్ పాయింట్ అని చెప్పింది. సాధారణ డ్రెస్ వేసుకున్నప్పుడు కూడా ఒక చిన్న టర్కోయిస్ స్టోన్ ఉన్న చెవి దిద్దులు లేదా గొలుసు వేసుకుంటే వెంటనే లుక్ ఫ్రెష్‌గా మారుతుందని ఆమె సూచించింది. భారీ ఆభరణాలు ఇష్టం లేని వారు కూడా ఈ రంగుతో చాలా సహజంగా, స్టైలిష్‌గా కనిపించవచ్చని తెలిపింది. ఫ్యాషన్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, మనం సాధారణంగా బంగారం, వెండి ఆభరణాలకే పరిమితం అవుతాం. కానీ టర్కోయిస్ లాంటి వైబ్రెంట్ రంగులను వాడటం వల్ల వ్యక్తిత్వానికి కొత్త అందం వస్తుంది. ముఖ్యంగా వేసవిలో ఈ ఆకాశనీలం–నీలి ఆకుపచ్చ రంగు కళ్ళకు చల్లదనాన్ని ఇచ్చి, క్లాసీ లుక్‌ను అందిస్తుంది. మొత్తానికి, చిన్న మార్పులతోనే పెద్ద స్టైల్ స్టేట్‌మెంట్ ఇవ్వొచ్చని తమన్నా చూపిస్తోంది. తదుపరి షాపింగ్‌లో ఒక టర్కోయిస్ జ్యువెలరీని చేర్చుకుంటే, మీ లుక్ కూడా సింపుల్‌గా ఉండి స్టైలిష్‌గా మెరవడం ఖాయం.

# ఓటీటీలోకి ‘మృత్యుంజయ్’




**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ హీరో శ్రీ విష్ణు నటించిన క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ ‘మృత్యుంజయ్’ చిత్రం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శన పూర్తి చేసుకుని ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. దర్శకుడు హుస్సేన్ షా కిరణ్ తెరకెక్కించిన ఈ చిత్రం తన విభిన్న కథాంశం, ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం ఏప్రిల్ 3, 2026 నుంచి స్ట్రీమింగ్ అయ్యే అవకాశముందని తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడాల్సి ఉంది. తెలుగు సహా పలు భాషల్లో ఈ సినిమాను విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. థియేటర్లలో విడుదలైన సమయంలో ‘మృత్యుంజయ్’ చిత్రం ఓ మోస్తరు విజయాన్ని అందుకున్నప్పటికీ, ఇందులోని థ్రిల్లింగ్ అంశాలు, అనూహ్య మలుపులు, బలమైన స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను కట్టిపడేశాయి. ముఖ్యంగా హీరో శ్రీ విష్ణు ఈ సినిమాలో పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించడం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కథానాయికగా నటించిన రెబా మోనికా జాన్ తన పాత్రకు న్యాయం చేస్తూ ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. అలాగే రచ్చ రవి, నెల్లూరు సుదర్శన్, సిజ్జు, అయ్యప్ప శర్మ వంటి నటులు తమ తమ పాత్రల్లో మెప్పించారు. క్రైమ్, యాక్షన్, భావోద్వేగాల మేళవింపుతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని అందించింది. ఈ చిత్రాన్ని లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. నిర్మాతలుగా సందీప్ గున్నం, వినయ్ చిలకపాటి వ్యవహరించగా, సంగీతాన్ని కాలభైరవ అందించారు. ముఖ్యంగా బ్యాక్‌గ్రౌండ్ సంగీతం సినిమాకు అదనపు బలాన్ని చేకూర్చింది. థియేటర్లలో మంచి స్పందనను సొంతం చేసుకున్న ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీ ద్వారా మరింత విస్తృత ప్రేక్షక వర్గాన్ని చేరుకునే అవకాశం ఉంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల అయితే, ‘మృత్యుంజయ్’ సినిమాకు మరింత ప్రజాదరణ లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073